ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
గురువారం 16 అక్టోబరు 2025



యూత్ కాంగ్రెస్ ఆందోళన

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువ సాఫ్ట్‌వేర్ ఆనంద ఆజీ ఆత్మహత్యకు ఆర్‌ఎస్ఎస్ వాదులే కారణమని పేర్కొంటూ వారి దిష్టిబొమ్మను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో బుధవారం దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కేరళకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఆనంద్‌పై ఆర్‌ఎస్ఎస్ వాదులు తీవ్ర మానసిక వేధింపులకు పాల్పడ్డారని అతని సూసైడ్ నోట్‌లో రాశాడని కర్ణాకర్ విమర్శించారు.

ఈ కార్యక్ర మంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, అఖిల్, తిలక్, ప్రేమ్‌కుమార్, రేవంత్, భాస్కర్, రిజ్వాన్, వినోద్, శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సెస్ లెస్!

లైబ్రరీలకు కేటాయించని నిధులు

- కుంటుపడుతున్న గ్రంథాలయాలు
- అరకొర సౌకర్యాలతోనే విజ్ఞాన భాండాగారాల నిర్వహణ
- జీపీ, మునిసిపాలిటీల నుంచి రాని 8 శాతం సెస్
- పన్నులు వసూలవుతున్నా దక్కని వాటా



భూపాలపల్లి జిల్లా గ్రంథాలయం

భూపాలపల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా వీటి స్థితి గతులు మారడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిధుల కేటాయింపు విషయంలో ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయని తెలుస్తోంది. గ్రామ స్థాయి నుంచి మొదలుకొని మునిసిపాలిటీ వరకు వసూలవుతున్న పన్నుల్లో 8 శాతం గ్రంథాలయాలకు కేటాయించాల్సి ఉన్నా ఆ ఊసే ఎత్తడం లేదు. ఒక వైపు అద్దె భవనాలు, అరకొర వసతులతో ఒకవైపు పాఠకులు ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు ఎప్పటికప్పుడు కావాల్సిన అప్‌డేట్ పుస్తకాలు అందించే వారే కరువయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

జిల్లా గ్రంథాలయాలకు రూ.3 కోట్ల బకాయిలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.3 కోట్లు బకాయి చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నిధులన్నీ గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీ నుంచి వసూలు చేసినవేనని అంటున్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును తిరిగి ప్రజల కోసమే కాకుండా ఇష్టమొచ్చినట్టు నిధులను మళ్లించి ఖర్చు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నా యి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూపా లపల్లి పట్టణంలోని జిల్లా గ్రంథాలయ నిర్మాణానికి రూ.కోటి మంజూరు కాగా పనులు అసంపూర్తిగా మిగిలాయి. అయితే.. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఆ నిర్మాణం పూర్తయ్యింది.

అరకొర సౌకర్యాలు.. అద్దె భవనాలు

భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 10 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో కేవలం ఐదింటికి మాత్రమే భవనాలు ఉన్నాయి. వాటిలో సైతం అరకొర సౌకర్యాలే ఉన్నాయి. మహదేవపూర్, రేగొండ, మొగుళ్లపల్లి, కాటారంతో పాటు చిట్యాలలో భవనాలు లేక అవి అద్దె ఇళ్లల్లోనే కొనసాగుతున్నాయి. వాటిలో సైతం అరకొర సౌకర్యాలే ఉన్నాయి. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో గ్రంథాలయాల ఆలనాపాలన చేసే నాథులే కరువయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. భూపాలపల్లిలోని జిల్లా గ్రంథాలయం ప్రస్తుతం నిర్మాణం పూర్తయినప్పటికీ అందులో పూర్తిస్థాయిలో విభాగాలుగా మార్చకపోవడంతో రీడర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెగ్యులర్‌గా వచ్చి చదువుకునే విద్యార్థులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. చల్లగరిగెలో సినీ గేయ రచయిత చంద్రబోస్ స్వ యంగా నిర్మిం చిన గ్రంథాల యం ఆ ప్రాంత విద్యార్థులకు, యు వకులకు ఎంతగానో ఉపయో గపడుతోంది.

12 ఏళ్లలో రూ. కోటి మాత్రమే..

గడిచిన 12 ఏళ్లలో అనగా బీఆర్ ఎస్ ప్రభుత్వం నుంచి మొదలుకొ ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు గ్రంథాలయాల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు రూ. కోటి మాత్రమే. అది కూడా భూపాలపల్లి జిల్లా ఏర్పాటు కావ డంతో ఇక్కడ కూడా గ్రంథాలయం ఉండాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. అందులోంచి భూపాలపల్లి గ్రంథాలయ నిర్మాణానికి రూ. కోటి మంజూరయ్యాయి. అయితే గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి గ్రామపంచాయతీ నుంచి ప్రత్యేకంగా గ్రంథాలయ పన్ను వసూలు చే స్తారు. అలాగే మునిసిపాలిటీ పరిధిలో కూడా ప న్ను వసూలు చేస్తారు. కానీ గ్రంథాలయాల అభివృద్ధి కోసం ఖర్చు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. భవిష్యత్ తరాలకు విజ్ఞానాన్ని అందిం చే గ్రంథాలయాలను ప్రభుత్వాలు పట్టించుకోకపో వడం దారుణమనే విమర్శలు వస్తున్నాయి. విద్యార్థులకు, ఉద్యోగార్థులకు ఎంతో విజ్ఞానాన్ని అందించే గ్రంథాలను అందించే ఈ భాండాగారాలను పట్టించుకోకపోవడం సరికాదని పాఠకులు అంటున్నారు. ఈ విషయంపై కలెక్టర్ చొరవచూపి గ్రంథాలయాలకు వచ్చే నిధులను వాటికి మాత్రమే ఖర్చు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఎమ్మెల్యే దొంతి తల్లికి సీఎం నివాళి

- మాతృవందనం కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు పరామర్శ
- హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- భారీ సంఖ్యలో పాల్గొన్న నర్సంపేట నియోజకవర్గ శ్రేణులు
- మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి భోజనం
- 27 నిమిషాల పాటు ఫంక్షన్‌హాల్‌లో గడిపిన సీఎం

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి బుధవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతికాంతమ్మ దశదిన కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన మాతృవందనం కార్యక్రమంలో పాల్గొన్నారు. హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఎం హాజరై కాంతమ్మ చిత్రపటానికి పూలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దొంతి మాధవరెడ్డిని, ఆయన సోదరులు, కటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి తన ప్రగాఢసానుభూతిని తెలియ చేశారు. సీఎం వెంటవచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా కాంతమ్మ చిత్రపటం వద్ద పూలుచల్లి అంజలి ఘటించారు. దొంతిని పరామర్శించారు. అనంతరం సీఎం వేదికపై నుంచి ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు చేయి ఊపుతూ అభివాదం చేశారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి భోజనం చేసి మధ్యాహ్నం 2.37 నిమిషాలకు తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో సీఎం 27 నిమిషాలపాటు ఉన్నారు.

గంట ఆలస్యంగా..

కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి గంట ఆలస్యంగా హాజరయ్యారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సీఎం మధ్యాహ్నం 1.15గంటలకు ఫంక్షన్‌హాల్‌కు చేరుకోవాల్సి ఉంది. గంట ఆలస్యంగా మధ్యాహ్నం 2.11 గంటలకు వచ్చారు. హైదరాద్‌లోని ఎంహెచ్ఆర్‌డీ నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి హనుమకొండ సుబేదారిలోని (మిగతా 9వ పేజీలో)



సీఎంను చూడడానికి రోడ్డుపై వేచి ఉన్న పారిశుధ్య కార్మికులు, జనం



ఘనంగా ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవం

మడికొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక 23వ, ఏబీఎన్ న్యూస్ చానెల్ 16వ వార్షికోత్సవం మడికొండలోని ఆంధ్రజ్యోతి వరంగల్ యూనిట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వర్దినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నేలపై గత రెండు దశాబ్దాలుగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ప్రజల పక్షం వహిస్తూ వారి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాయని తెలిపారు. నిబద్ధత, నిర్భీతి ఊపిరిగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ప్రస్థానం నిరంతరం సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్ ఇన్‌చార్జి దొంతు నవీన్, ప్రొడక్షన్ రీజనల్ మేనేజర్ బైరి అజయ్ కుమార్, యాడ్స్ మేనేజర్ మాటేటి రమేశ్, సర్క్యులేషన్ మేనేజర్ షరీఫ్, సిస్టమ్స్ ఇన్‌చార్జి చక్రధర్, సబ్ ఎడిటర్లు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం

- పేదలందరికీ సంక్షేమ ఫలాలు
- అర్హులందరికీ ఇళ్లు కేటాయించే బాధ్యత నాదే..
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

10వ పేజీలో..



ఏటూరునాగారంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దు

- బుగులోని జాతర పనులు పది రోజుల్లో పూర్తి చేయాలి
- అటవీ శాఖ అనుమతులు రాగానే రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



బుగులోని జాతర అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రేగొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : బుగులోని జాతర అభివృద్ధి పనుల్లో అధికారులు ఏమాత్రం అలసత్వం వహించొద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని తిరుమలగిరి శివారులో రూ.2 కోట్లతో సాగుతున్న బుగులోని జాతర అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఏటా కార్తీకమాసంలో జరిగే బుగులోని వెంకటేశ్వరస్వామి జాతరకు లక్షల మంది భక్తులు వస్తారని, వారి సౌకర్యార్థం అనేక పనులు చేపడుతున్నామని అన్నారు. ముఖ్యంగా మెట్లను విస్తరించడం, కోనేరు, కల్యాణ మండపం, భక్తుల విడిది తదితర నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. జగ్గయ్యపేట, తిరుమలగి రి నుంచి జాతరకు వచ్చే రోడ్డు త్వరలో (మిగతా 10వ పేజీలో)

మొన్న మల్లోజుల... నేడు ఆశన్న

- లొంగిపోయేందుకు సిద్ధంగా వాసుదేవరావు!
- మిలటరీ దాడుల్లో దిట్ట
- అలిపిరి బ్లాస్ట్‌లో ప్రధాన సూత్రధారి
- ఆశన్నది ములుగు జిల్లా నర్సింగాపూర్

ములుగు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగలనుంది. కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న తన సహచరులు 70 మందితో కలిసి ఛత్తీస్‌గఢ్ సీఎం ఎదుట గురువారం లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే ఆ పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయిన విషయం విదితమే. ఆశన్న కూడా అదే బాటపట్టినట్టు తెలుస్తోంది. 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని రూపుమాపుతానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కంకణం కట్టుకున్నారు. ఈ క్రమంలో ఆపరేషన్ కగార్ పేరిట వందల మంది మావోయిస్టులను అంతమొందించారు. నక్సలైట్లు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పోలీసు బలగాలు మావోయిస్టులపై మరిత నిఘాను ముమ్మరం చేశాయి. ఈ నేపథ్యంలోనే పలువురు మావోయిస్టులు అడవి బాట వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోయేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలువురు అగ్రనేతలు లొంగిపోయారు. వారిని సహచర బృందాలు అనుసరించాయి. ఆశన్న సైతం అదే లొంగిపోయేందుకు సిద్ధమయ్యారని సమాచారం. గురువారం ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి ఎదుట మరో 70 మంది సహచరులతో ఆయన లొంగిపోనున్నట్లు తెలుస్తోంది.



ఆశన్న (ఫైల్)

నర్సింగాపూర్‌లో పుట్టి.. అడవి బాటపట్టి..

ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్. ఈ గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి భిక్షపతిరావు, సరోజన దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు వాసుదేవరావు. చిన్న కుమారుడు సహదేవరావు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. అనంతరం కాజీపేట ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యను అభ్యసించాడు. చిన్నతనం నుంచి మావోయిస్టు భావజా లానికి ఆకర్షితుడై అతడు 1990లో అడవి బాట పట్టాడు. 38 సంవత్సరాల క్రితం వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఆశన్నపై కేసు నమోదై ఉంది. ఆయ న అజ్ఞాతంలోకి వెళ్లిన కొద్దిరోజులకే తండ్రి మరణించాడని, తల్లి సరోజన చిన్న కుమారుడి వద్ద ఉంటోందని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం ఆశన్న వయసు 60 సంవత్సరాలు పైబడి ఉండొచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అనేక దాడుల్లో కీలకపాత్ర

నక్సల్స్ ఉద్యమలో కొనసాగిన ఆశన్న మొదట కాకతీయ యూనివర్సిటీ సీపీఐ(ఎంఎల్) పీపుల్స్‌వార్ అనుబంధ రాడికల్ స్టూడెంట్ యూనియ న్‌కు నాయకత్వం వహించాడు. అనంతరం అజ్ఞాతవాసం పట్టి మావో యిస్టు కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి చేరుకున్నాడు. బాంబులు, ఆయుధాల తయారీతోపాటు గెరిల్లా వార్‌ఫేర్‌లో ఆరితేరిన ఆశన్న మిలటరీ దాడుల్లో కీలకపాత్ర పోషించాడు. ఐపీఎస్ ఉమేష్‌చంద్ర, మాజీ హోం మంత్రి మాధవరెడ్డి హత్యల్లో కూడా పాల్గొన్నాడు. మావోయిస్టు పార్టీలో రాజకీయ వ్యూహాలు, సైనిక కార్యకలాపాల్లో ప్రచార విషయాల్లో కీలకంగా వ్యవహరించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి సీఎం చంద్రబాబు నాయుడిపై 2003 అక్టోబరు 1న అలిపిరిలో జరిగిన దాడిలో ఆశన్న పాత్ర కీలకం. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చంద్రబాబు నాయుడు వెళ్తున్న క్రమం లో క్లైమోర్ మైన్స్ పేలి చంద్రబాబు (మిగతా 10వ పేజీలో)


ఆంధ్రజ్యోతికి 23 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు ...
పైడాకుల అశోక్
కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ములుగు జిల్లా
బానోతు రవిచందర్
జిల్లా గ్రంథాలయ చైర్మన్
రేగ కళ్యాణి
ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్
మల్లాడి రాంరెడ్డి
టి.పి.సి.సి. ప్రధాన కార్యదర్శి
జిల్లా ప్రజలకు, పార్టీ నాయకులకు, యూత్ నాయకులకు,కార్యకర్తలకు, మహిళా సోదరీమణులకు,
అధికారులకు, శ్రేయోభిలాషులకు, రైతులకు, మిత్రులకు
దీపావళి మరియు కార్తీక పౌర్ణమి
శుభాకాంక్షలు...
ప్రజా పాలనలో
ములుగు జిల్లాలో
అభివృద్ధి వెలుగు
రూ॥ 25 కోట్లతో బయోసైన్స్ ఆయిల్ ఫామ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు కృషి.
మేడారం జాతర అభివృద్ధి పనుల కోసం రూ॥ 150 కోట్ల నిధులు మంజూరు.
రూ॥ 21.30 కోట్లతో 8 సబ్ స్టేషన్‌ల ఏర్పాటు.
ములుగు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ॥ 65 కోట్ల నిధులు.
ఐటీడీఏ నూతన భవన సముదాయ నిర్మాణానికి
రూ॥ 15 కోట్ల నిధుల కేటాయింపు.
నూతన కలెక్టర్ కార్యాలయం కోసం
రూ॥ 63.50 కోట్లు మంజూరు.
రూ॥ 5 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం పనులు.
రూ॥ 6 కోట్లతో ఏటూరునాగారంలో నూతన బస్ డిపో ఏర్పాటుకు కృషి.
జిల్లాలో 33 11 కెవి 8 సబ్ స్టేషన్ల మంజూరు.
రూ॥ 80 కోట్లతో నూతన కోర్టు భవనాలు మంజూరుకు కృషి.
రూ॥ 556 కోట్లతో జిల్లాలో నూతన రోడ్లు, అధునాతన భవనాల ఏర్పాటు.
రోడ్ల అభివృద్ధికి రూ॥ 301.47 కోట్ల నిధుల మంజూరు.
చెరువు కట్టలు, మత్తళ్ళు అభివృద్ధికి
రూ॥ 1,86,444 కోట్ల నిధుల మంజూరు.
పనుల జాతర పథకం ద్వారా గ్రామాల అభివృద్ధి
రూ॥ 1,20,000 కోట్ల నిధుల మంజూరు.
కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా



ఎల్కతుర్తిలోని ఓ గ్రానైట్ కటింగ్ కంపెనీ

బండ బారుతున్న జీవితాలు

- గ్రానైట్ కటింగ్ ఇండస్ట్రీతో పొంచి ఉన్న ప్రమాదం
- నిబంధనలు పాటించని కంపెనీలు
- దుమ్ము, శబ్దంతో వాతావరణం కలుషితం
- బావుల్లో అడుగంటిన నీరు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఎల్కతుర్తి, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలో నిర్మించిన గ్రానైట్ ఫ్యాక్టరీలతో ఈ ప్రాంతానికి ప్రమాదం పొంచి ఉంది. మిషన్ల శబ్దం, దుమ్ముతో పర్యావరణం దెబ్బతింటుంది. పంటలూ దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఫ్యాక్టరీల నుంచి వెలువడే దుమ్ముధూళితో ఈ ప్రాంత ప్రజలు శ్వాసకోస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. నిత్యం పచ్చదనంతో ఉండే ప్రాంతంలో మొక్కలు మొలకెత్తని దుస్థితి నెలకొంది. ఫ్యాక్టరీస్ నిర్వాహకులు నిబంధనలు పాటించక పోవడంతో ఈ ప్రాంతానికి భారీ ప్రమాదం పొంచి ఉంది.

సాగుకు అనువైన భూముల్లో పరిశ్రమలు

వ్యవసాయ సాగుకు అనువైన భూముల్లో గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. అధికారులు, వ్యాపారులు ఇచ్చిన మాముళ్లకు కక్కుర్తి పడి విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఫ్యాక్టరీల నిర్మాణాలను పరిశీలించకుండానే గోరంత అనుమతులతో కొండంత విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు. కొన్ని ఫ్యాక్టరీలకు సరైన అనుతులు లేకుండానే యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు గ్రానైట్ కటింగ్ కంపెనీ వ్యాపారులకు కొమ్ముకాస్తున్నారు. వాణిజ్య, పారిశ్రామిక ఉపయోగాలకు బోరు వేయడానికి రాష్ట్ర భూగర్భ జల విభాగం (సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ) నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలి. వ్యవసాయాధారిత ప్రాంతాల్లో కేవలం 160 ఫీట్లుకు పైగా బోరు వేస్తే చుట్టు పక్కల ఉన్న వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటి పోయే ప్రమాదం ఉంది. ఎలాంటి అనుమతులు పొందకుండానే ఒక్కొక్క కంపెనీలో వెయ్యి ఫీట్ల లోతుకు పైగా బోర్లు వేశారు. గ్రానైట్ కటింగ్ మిషన్‌కు నిత్యం నీరు అవసరం ఉండడంతో నిరంతరాయంగా బోర్లతో నీటిని తోడేస్తున్నారు. దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావుల్లో సైతం నీరు అడుగంటి పోయింది. కంపెనీల తీరుపై పొల్యూషన్ నియంత్రణ, రెవెన్యూ, ట్రాన్స్‌పోర్టు అధికారులకు స్థానికులు గతంలో ఫిర్యాదు చేశారు. పరిశ్రమలను తనిఖీ చేసి వారిచ్చే మాముళ్లు తీసుకుని జారుకుంటున్నారే తప్ప ఏ ఒక్క కంపెనీపై చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

40కి పైగా గ్రానైట్ కటింగ్ పరిశ్రమలు

ఎల్కతుర్తి, గోపాల్‌పూర్, సూరారం గ్రామాల శివారు వ్యవసాయ భూములను కొందరు కొనుగోలు, మరికొందరు లీజుకు తీసుకుని 38 గ్రానైట్ కటింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేశారు. గజాల్లో వ్యవసాయ భూములను నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్) కన్వర్షన్ చేయించుకుని ఎకరాల విస్తీర్ణంలో అధికారుల అండదండలతో నిర్మాణాలు చేపట్టారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడిందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని పరిశ్రమలు నిర్మించిన భూములకు రైతు భరోసా డబ్బులు పడుతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.



గ్రానైట్ కోసం వచ్చే లారీతో చెలరేగుతున్న దుమ్ము

శబ్ద కాలుష్యం

అమావాస్య రోజు మినహా ప్రతిరోజూ 24 గంటల పాటు గ్రానైట్ కంపెనీల్లో కటింగ్ మిషన్లు నిరంతరంగా నడుస్తున్నాయి. వాటి ద్వారా వచ్చే శబ్దానికి చుట్టు పక్కల రైతులు, పక్కనే ఉపాధి పొందుతున్న గీత కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక కటింగ్ మిషన్ ద్వారా 100 నుంచి 105 డీబీ (డెసిబుల్) శబ్దం ఉత్పన్నమవుతుంది. 40 కంపెనీల్లో యంత్రాల ద్వారా వచ్చే శబ్దాన్ని ప్రజలు భరించలేకపోతున్నారు. శబ్దం బయటకు రాకుండా ఏర్పాట్లు చేయాల్సిన ఫ్యాక్టరీల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

దెబ్బతింటున్న పంటలు

గ్రానైట్ కటింగ్ అలాగే పెద్ద బండలను తీసుకెళ్లే లారీల రాకపోకలతో వచ్చే దుమ్ము ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా దుమ్ము దర్శనమిస్తుంది. కటింగ్ ద్వారా వచ్చే దుమ్మును ఎక్కడ పడితే అక్కడే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో మొక్కలు సైతం మొలకెత్తని పరిస్థితి నెలకొంది. పంటలపై దుమ్ము పడి దెబ్బతింటున్నాయి. దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. కంపెనీలు దుమ్ము చెలరేగకుండా చర్యలు చేపట్టడం లేదు. కంపెనీలకు పక్కనే ఎన్‌హెచ్ - 563 ప్రధాన రహదారి ఉండడంతో అటుగా వెళ్లే వాహనదారులు సైతం దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు.

నియంత్రణ చర్యలు శూన్యం

ప్రమాదాలను నివారణకు అధికారులు, నిర్వాహకులు చర్యలు తీసుకోవడం లేదు. నిబంధనలు పాటించని కంపెనీలపై చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులకు అడ్డు అదుపు లేకుండా పోయింది. తనిఖీ చేయాల్సిన అధికారులు నెలవారీ మాముళ్లు ముట్టడంతో కిమ్మనకుండా ఉంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీల తీరుపై ఫిర్యాదు చేస్తే అది అధికారులకు వరంగా మారుతుంది. ఈ వంకతో పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవినీతికి పాల్పడుతున్న సంబంధిత అధికారులు, నిబంధనలు పాటించని గ్రానైట్ కంపెనీల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణీ అధికారులు

ధాన్యం సేకరణ సజావుగా సాగాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశించారు. బుధవారం వారు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో ధాన్యం సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 చొప్పున మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. సన్న రకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 500 చొప్పున బోనస్ అందిస్తున్నందున ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి ధాన్యం తరలించే అవకాశం ఉందని, దాన్ని అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో పోలీసులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో ఈసారి వానాకాలంలో 3.15 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామని, అందుకోసం 258 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ధాన్యం సేకరణ సజావుగా జరిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాకు 1200 అదనపు టార్పాలిన్లు కేటాయించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, మేనేజర్ సంధ్యారాణీ, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా రవాణా శాఖ అధికారి శోభన్‌బాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో

అంతరాయాలను తగ్గించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.మధుసూదన్

రాంనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టి.మధుసూదన్ అధికారులకు సూచించారు. వరంగల్ సర్కిల్ అధికారులతో బుధవారం ములుగురోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. లూజ్ లైన్‌లు లేకుండా సరిచేయాలని, వేసవి కాలంలో ఓవర్‌లోడ్ తగ్గించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

పొలం బాట ద్వారా రైతులకు విద్యుత్ ప్రమాదాలు, విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. డీటీఆర్ ఫెయిల్యూర్‌లను తగ్గించాలన్నారు. ఫెయిల్యూర్‌లు అయితే సత్వరమే నూతన డీటీఆర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ సీఈ రాజు చౌహాన్, వరంగల్ సర్కిల్ ఎస్ఈ గౌతంరెడ్డి, డీఈ టెక్నికల్ ఎ.ఆనందం, వరంగల్ డీఈ మల్లికార్జున్, నర్సంపేట డీఈ తిరుపతి, ఏఎస్వో సంజీవరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ హర్షి, సర్కిల్ పరిధిలోని ఏడీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీల చోరీ ముఠా అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్ రెడ్డి

నర్సంపేట టౌన్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : నర్సంపేట నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో బ్యాటరీ దొంగతనం చేసిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన గుంజే సంపత్, ప్రశాంత్, జఫర్‌గఢ్‌కి చెందిన గండికోట మహేష్, బోసు సాంబరాజు అనే నలుగురు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని, నర్సంపేట మండలం, చుట్టు పక్కల గ్రామాల్లో సోలార్ లైట్ పోలుకి ఉండే బ్యాటరీలు దొంగతనం చేశారు. గత మూడు నెలలుగా నర్సంపేట మండలంలోని చంద్రయ్యపల్లి, దాసరిపల్లి, బాంజీపేట, రాజేశ్వరరావు పల్లి, ఇటుకాలపల్లి, ఆకులతండా, భోజ్యనాయక్ తండా, మాధన్నపేట, నాగుర్లపల్లి, మహేశ్వరం గ్రామాల్లో దొంగతనం చేసినట్లు ఏసీపీ రవీంధర్ రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి 38 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 2లక్షల 25 వేలు ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

పీసీ నాగరాజుని అభినందించిన ఏసీపీ

నర్సంపేట నియోజకవర్గంలో వరుస దొంగతనాలు జరుపుతున్న నేపథ్యంలో ఎస్సై అరుణ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. బ్యాటరీ దొంగతనం మొదటగా చంద్రాయపల్లిలో చోటు చేసుకుంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ ఇంటి సీసీ కెమెరాల్లో అనుమానాస్పద వ్యక్తులను గమనించిన కానిస్టేబుల్ నాగరాజు ఆ వైపుగా విచారణ మొదలుపెట్టినట్లు ఏసీపీ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ ప్రత్యేకంగా శ్రద్ధ చూపిస్తూ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సదురు కానిస్టేబుల్ నాగరాజుకి రివార్డును సైతం అందజేశారు.

42 శాతం రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

18న నిర్వహించే బంద్‌కు మద్దతు - టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్



నర్సంపేటలో మాట్లాడుతున్న అంబటి శ్రీనివాస్

నర్సంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన అనంతరం ఆ రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ పరమైన అడ్డంకులు ఉన్నాయని, సుప్రీంకోర్టు ముందు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం, జీవో 9 కోర్టుల ముందు చెల్లుబాటు కాదనే వాదనలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కొన్ని రోజుల కిందట హైకోర్టు దానికి ఊతం కల్పిస్తూ తెలంగాణలో తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్ల జీవోకు స్టే ఇచ్చిందన్నారు. దేశ వ్యాప్తంగా రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ ఉందన్న చర్చ జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుద్వం పార్లమెంట్‌లో చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ జన సమితి డిమాండ్ చేస్తుందని అంబటి శ్రీనివాస్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చర్చ కేవలం స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లకు పరిమితం చేయకుండా విద్యా, ఉద్యోగ అవకాశాలకు విస్తరిస్తూ చట్ట సభల్లో కూడా రిజర్వేషన్లు సాధించే దిశగా ఉండాలని ఆయన అన్నారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర బంద్‌కు తెలంగాణ జన సమితి మద్దతు నిస్తుందన్నారు. ఈ బంద్‌కు ప్రజలు సహకరించాలని కోరారు. కార్య క్రమంలో టీజేఎస్ రాష్ట్ర నాయకులు గుంటి రాంచందర్, బొనగాని రవీందర్, షేక్ జావెద్, ఎలిశాల రాజేశ్, సాంబరాతి మల్లేశం, సోల్తి సాయికుమార్, రామగిరి మాధవి, కాసాని పద్మ, ఎం. రజిత, సంథాని, పండగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా క్రీడా పోటీలు నిర్వహిస్తాం..

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ వరద రాజేశ్వర్‌రావు



మాట్లాడుతున్న వరదరాజేశ్వర్‌రావు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈ నెల 18వరకు హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న 5వ జాతీయస్థాయి అండర్-23మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల నిర్వహణపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరదరాజేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలను వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. హనుమకొండలోని జేఎన్ఎస్, నిట్ కళాశాల మైదానాల్లో జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీల్లో దేశం నలుమూలల నుంచి 937మంది అథ్లెట్లు, 135మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొననున్నారని తెలిపారు. అదే విధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 25మంది మెన్ అండ్ ఉమెన్ అథ్లెట్లు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన వెల్లడించారు. మూడు రోజుల పాటు జంప్స్, త్రోస్, రన్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్)లో పోటీలు కొనసాగుతాయన్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) నిబంధనల మేరకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ పోలీస్ కమిషనర్, సన్‌ప్రీత్‌సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్‌బాజ్‌పాయ్‌లు పాల్గొంటారని వరదరాజేశ్వర్‌రావు తెలిపారు. ఈ సమావేశంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ అథ్లెట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతి తల్లికి సీఎం నివాళి

(7వ పేజీ తరువాయి)

ఆర్ట్స్ అండ్ సైన్స్ గ్రౌండ్‌లో దిగారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. వేదికపై 4 నిమిషాలు గడిపారు. అనంతరం భోజనానికి వెళ్లారు. మధ్యాహ్నం 2.27 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు. ముఖ్యమంత్రి వెంట ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మన్, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, రాంచంద్రునాయక్, యశశ్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శ్రీపాల్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి దొంతి అనుచరులు, అభిమానులు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య తదితరులు

భారీ బందో బస్తు

సీఎం రాక సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫక్షన్ హాల్‌లోనూ, బయట అడుగడుగునా పోలీసులు మోహరించారు. విస్తృతంగా తనఖీలు నిర్వహించారు. సీఎం రావడానికి అరగంట ముందే ఫంక్షన్ హాల్‌లోని వేదికను స్వాధీనం చేసుకున్నారు. సీఎం వచ్చి వెళ్లే వరకు ముఖ్యులను మాత్రమే వేదికపైకి అనుమతించారు. నాయకులు తరలివచ్చిన వాహనాలతో రోడ్డంతా నిండిపోయింది. సీఎంను చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు భవనాలపై ఎక్కారు. డివైడర్లపై బారులు తీరి నిల్చున్నారు. సీఎం హాల్‌లోకి రాగానే కార్యకర్తలు ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యేలు, అధికారులు, కాం గ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి దశదినం సందర్భంగా ఏర్పాటు చేసిన మాతృ వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన సీఎంకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఘన స్వాగతం లభించింది. సీఎంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మన్‌కుమార్, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్ ద్వారా ఆర్ట్స్ అండ్ కాలేజీ గ్రౌండ్ కు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద సీఎంకు మంత్రి సీతక్క, ఎంపీలు పోరిక బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సార య్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్యశారద, వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మేయర్ సుధారాణి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాధవరెడ్డిని పరామర్శించిన అనంతరం హెలిప్యాడ్ వద్ద సీఎం కు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వీడ్కోలు పలికారు.







సీఎంకు బొకే ఇస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్, పూలమొక్కలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్య శారద

సీఎంను దగ్గర నుంచి చూడాలని ఆరాటం

- పక్కకు తోసేసిన పోలీసులు
- నెరవేరని పారిశుధ్య కార్మికుల కోరిక



పారిశుధ్య కార్మికులను అడ్డుకుంటున్న ఓ పోలీస్ అధికారి

హనుమకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వారంతా మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికులు. హనుమకొండలోని కేయూ 100 ఫీట్ల రోడ్డులోని పీజీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి కాంతమ్మ మాతృవందనం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి వస్తుండడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఉదయం నుంచే అక్కడ గ్యాంగ్ వర్క్ చేపట్టారు. మహిళా పారిశుధ్య కార్మికులు ఆ ప్రాంతమంతా ఊడ్చి శుభ్రం చేశారు. ఎక్కడా చెత్త కనిపించకుండా అద్దంలా మార్చారు. సీఎం రావడానికి కొద్దిసేపటి వరకు కార్మికులు పారిశుధ్య పనులు చేస్తూనే ఉన్నారు. ఇంతలో సీఎం వస్తుండంతో ఆయనను దగ్గర నుంచి చూడాలన్న ఉత్సుకతో ఈ మహిళా కార్మికులంతా చేతుల్లో చీపుర్లతోనే రోడ్డు పక్కన నిలబడి వేచి చూస్తున్నారు. సీఎం కాన్వాయి ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటున్నది. వారిలో ఉత్సాహం మరింత పెరిగింది. ఉత్సాహంగా ముందుకు వస్తున్న వీరిని పోలీసు అడ్డుకున్నారు. దూరంగా పంపించారు. అంతలోనే సీఎం కారు ఫంక్షన్ హాల్‌లోకి రయ్‌మంటూ వెళ్లిపోయింది. దీనితో వారి కోరిక నెరవేరలేదు. నిరాశతో వెనుదిరిగారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం

- పేదలందరికీ సంక్షేమ ఫలాలు
- అర్హులందరికీ ఇళ్లు కేటాయించే బాధ్యత నాదే..
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ఏటూరునాగారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వద్ద రూ. 1.5 కోట్లతో చేపడుతున్న మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి పేద వాడికీ సొంతిల్లు అందించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ముస్లిం శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో భాగంగా ఏటూరునాగారం మండల కేంద్రంలో ఉన్న ముస్లింలకు 140 ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. రాబోయే రాజుల్లో ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జామా మసీదు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అఫ్జల్ పాషా మాట్లాడుతూ మైనారిటీ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఇందుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ములుగు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, తహసీల్దార్ జగదీశ్వర్, జామా మసీదు కమిటీ ప్రధాన కార్యదర్శి ఎమ్డీ. ఆరిఫ్, కోశాధికారి సుజాఅత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, ముస్లిం పెద్దలు సులేమాన్, అక్బర్, అబ్దుల్, వాజిద్, చాంద్, ఖలీల్, గౌస్, సలీం తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చిట్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూకల్లులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో తనిఖీ చేయగా అదే గ్రామానికి చెందిన ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారి నుంచి రూ. 2వేలు స్వాధీనం చేసుకుని కేసు నమో దు చేసినట్లు చెప్పారు. తనిఖీలో కాని స్టేబుళ్ల అస్లం, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

● మల్హర్ (ఆంధ్రజ్యోతి) : తాడిచర్ల అటవీ ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ తెలిపారు. 10 మం దిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 50,500 నగదు, 10 మొబైల్ ఫోన్లు, 52 ప్లేయింగ్‌కార్డులు, ఒక ద్విచక్ర వాహనం, ఒక కారును స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం నిందితులు, స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తప్పుడు కేసులు ప్రజాస్వామ్యానికి మచ్చ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులపై కాంగ్రెస్ పెట్టిన తప్పుడు కేసులు ప్రజాస్వామ్యానికి మచ్చ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం విమర్శించారు. ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో ఆయన బుధవారం విలేకరులతో మా ట్లాడారు. బీజేపీ నాయకులపై మంత్రి సీతక్క ప్రోద్బలంతో తప్పుడు కేసులు పెట్టడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని భయపెట్టే ప్రయత్నం జరుగు తోందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ప్రజల కోసం నిరం తరం పోరాడే పార్టీ నాయకులపై దౌర్జన్యంగా కేసులు నమోదు పెట్టడం అధికార దుర్వినియోగమేనని దుయ్యబట్టారు. ఆయన వెంట న్యాయవాది కన్నేజు సునీల్ కుమార్‌తోపాటు బీజేపీ నాయకులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, వాసుదే వరెడ్డి, కొత్త సురేందర్, భూక్య జవహర్ లాల్, శీలమంతుల రవీంద్రాచారి, నగరపు రమే ష్, జినుకల కృష్ణాకర్‌రావు, రాకేష్, రాయంచు నాగరాజు, గాధం కుమార్, రవిరెడ్డి, బైకని మహేందర్, చల్లూరి మహేందర్ తదితరులు ఉన్నారు.

కాళేశ్వరాలయ హుండీ లెక్కింపు

మహదేవపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరాలయ హుండీలను బుధవారం లెక్కించారు. అలయ ఈవో మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహింఆచరు. పర్యవేక్షణాధికారిగా నందనం కవిత వ్యవహరించారు.

నాలుగు నెలల 12 రోజులకు ఆలయానికి రూ. 31, 64, 858 ఆదాయం సమకూరింది.

మహిళలు రక్తహీనతను జయించాలి

చిట్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు బలవర్ధక ఆహారాన్ని తీసుకుని రక్తహీనత సమస్యను జయించాలని శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లీశ్వరి అన్నారు. మండలంలోని ఎలేటిరామయ్యపల్లిలో బుధ వారం నిర్వహించిన పోషణమాసోత్సవం కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, సేంద్రియ ఎరువులతో సాగు చేసిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. శిశు, మాతృ మరణాలను తగ్గించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింత, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని, దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం గుర్రం రాజేందర్, సూపర్వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యాయుడు చక్రపాణి, అంగన్‌వాడీ టీచర్లు ప్రతిభ, శారద, వెంకటరమణ, రజిత, జ్యోతి, కవిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాటాలు ఉధృతం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్

ములుగు టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను సాధించుకోవడానికి సమరశీల పోరాటాలను ఉధృతం చేయాని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం గంజ శీనివాస్, పెద్దకాసు వినోద్ ఆధ్వర్యంలో బుధ వారం జరిగిన ఏఐటీయూసీ సమావేశానికి ముఖ్యఅతిథిగా రవీందర్ హాజరయ్యారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ పాలకులు మాత్రం అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సామల రమ, సిపిఐ సీనియర్ నాయకులు ఇంజం కొమురయ్య, ముత్యం కొమురయ్య, వీరన్న, శ్రావణ్, శ్రీనివాస్, అజిత, సంధ్య, లలిత, సమత, దీపిక తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

టీటీయూ జిల్లా అధ్యక్షుడు సర్వర్ అహ్మద్

వెంకటాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ సర్వర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్‌టీయూ కార్యవర్గం ఎన్నిక



రమేష్



రాజు

కన్నాయిగూడెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (టీఎస్ ఎస్టీయూ) మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఏటూరునాగారం మండల అధ్యక్షుడు టీ.వి. వీరభద్రం, అసోయేట్ అధ్యక్షుడు అపడ రాజేందర్ సమక్షంలో కార్యవర్గాన్ని ఖరారు చేశారు. కన్నాయిగూడెం మండల అధ్యక్షుడిగా నగరి రమేష్, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి రాజు, మహిళా విభాగం అధ్యక్షరాలిగా బి.సుమ లతాదేవి, ఉపాధ్యాక్షురాలిగా ఏలియా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సంఘం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎస్‌బి నాయుడు, జిల్లా నాయకులు పోతు రాజశేఖర్, సుమన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బి.రాజేంద్రప్రసాద్, బోగి నరిసింహులు, మున్నె రాజేందర్ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జోనల్ కమిటీ ఎన్నిక

ఏటూరునాగారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) మండల జోనల్ కమిటీని ఏర్పాటు చేసినట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల ఉప్పస్వామి, పల్లె నాగరాజు తెలిపారు. బుధవారం మండలం కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బడుగు రాజు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.సంఘం బలోపేతం కోసం జోనల్ కమిటీ కన్వీనర్‌గా గుగులోత్ రాందేవ్‌ను, కో-కన్వీనర్‌గా అబ్బోజు రాజేంద్రాచారిని నియమించినట్లు ప్రకటించారు. ఈ కార్యమంలో టీపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు హాట్కార్ సమ్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి భూక్యా సారంగపాణి, ఉపాధ్యాయ దర్శిని సంపాదక సభ్యులు వి.దిలీప్, జిల్లా నాయకులు శ్యామ్ సుందర్, మండల నాయకులు టి.రామకృష్ణ, సతీష్, జాకీర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ఏటూరునాగారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ప్రజలకు ఉచితంగా కంటి పొర శస్త్రచికిత్సలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న మొబైల్ కంటి శిబిరం పోస్టర్‌ను కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్ బుధవారం ఆవిష్కరిం చారు. ముందుగా జిల్లా కలెక్టర్ దివాకర్, అదనపు కలెక్టర్ మహేం దర్‌జీ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి గోపాలరావు ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ పుణ్య కార్యక్రమం జిల్లా పరిసర గ్రామ ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందని కలెక్టర్ దివాకర్ తెలిపారు. అదేవి ధంగా, ములుగు జిల్లా ఎస్పీ శబరీష్, సంజోష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సినీ నటుడు సంజోష్ హరి, హైకోర్టు అడ్వకేట్, దిశా లా ఫర్మ్ వ్యవస్థాపకుడు పూజారి నాగేశ్వ రరావుతో కలిసి ఎస్పీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 22 నుంచి 30 వరకు ఏటూరునా గారంలోని గిరిజన భవన్ వద్ద ఈ శిబిరం జరగనుంది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దివాకర

నారోటిక్ డ్రగ్స్‌పై అవగాహన

వెంకటాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మైనారిటీ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యాంటీ నారోటిక్ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఎస్సై చల్ల రాజు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, కోఆర్డినేటర్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చిట్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిద్దెముత్తారంలో క్రికెట్ క్రీడాకారులకు మాజీ ఎంపీటీసీ పప్పుల విజయలక్ష్మి సంజీవయ్య క్రీడా దుస్తులు బుధవారం పంపిణీ చేశారు. అదేవిధంగా పంచిక మహేష్ క్రికెట్ బ్యాట్‌ను అందించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోషాలు, ఆకుల చేరాలు, ప్రభాకర్, వెంకట్ నాయక్, సదయ్య, మోరె రవీందర్, సిద్దు, రత్నం రమేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎం సెంటర్ ఏర్పాటుకు భూమి పూజ

మల్హర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్ సబ్‌స్టేషన్ ఆవరణంలో ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్ షెడ్ నిర్మాణానికి బుధవారం భూమి పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ సదానందం, ఆపరేషన్ డీఈ పాపిరెడ్డి, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, మాజీ జడ్పీటీసీ అయిత కోమలరాజిరెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు వ్యవసాయ పరికరాలు

మల్హర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై 131 పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఏవో శ్రీజ బుధవారం తెలిపారు. ఈ నెల 22 వరకు ఆసక్తి గల రైతులు అప్లికేషన్ ఫారంతో ఆధార్‌కార్డు, పట్టాపాస్ బుక్ సంబంధిత పత్రాలను జత చేసి కొయ్యూర్ లేదా తాడిచర్లలో సమర్పించాలని సూచించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయండి : బీజేపీ

మహాముత్తారం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మండలంలోని నిమ్మగూడెం గ్రామం నుంచి కనుకునూర్ వరకు 16 కిలోమీటార్ల రోడ్డు గుంతలమయంగా మారిందని, దాని మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్ డిమాండ్ చేశారు. నిమ్మగూడెం- కనుకునర్ రోడ్డును నాయకులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. వర్షాలకు చాలా చోట్లా రోడ్డు ధ్వంసమైందని, ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు ఎం.డి.రఫి, జాడి రమేష్, నాయకులు అంజిబాబు, సడువలిరావు, రమేష్, నితిన్, లక్ష్మణ్, రాజు, అరుణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్లు బాధ్యతగా పనిచేయాలి

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) విభాగంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్‌లు బాధ్యతాయుతంగా పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి సూచించారు. బుధవారం భూపాలపల్లి మునిసిపాలిటీ కార్యాలయంలో మెప్మా పీడీ రాజేశ్వరి అధ్యక్షతన అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నూతన మహిళా సంఘాల ఏర్పాటు ఆవశ్యకత ఉందని అన్నారు. బ్యాంకు లింకేజీ, స్ట్రీట్ వెండర్‌లకు రుణాలు ఇవ్వడం, వాటిని రికవరీ చేయడంలో రిసోర్స్ పర్సన్‌లు కీలక భూమిక పోషించాలని అన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఏడీఎం తిరుపతి, కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు, రిసోర్స్‌పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు. .

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం కొనుగోలుకు యంత్రాంగం సిద్ధం కావాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణరావు, సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీం ద్రతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపా లపల్లి నుంచి ఆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు నుంచి ఆ జిల్లా కలెక్టర్ దివాకర హాజరయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్షించారు. ఈ వానాకాలంలో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అత్యధికంగా 148.03లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలును చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేయడంపైప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు.

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ధాన్యం రవాణా కాంట్రాక్టు ఖరారు చేయాలని, సరిపడా వాహనాలను సిద్ధంగా ఉంచుకని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని అన్నారు. జిల్లాల్లో వరి కోతలు ప్రణాళికాబద్ధంగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు, గన్నీబ్యాగులు, వెయింగ్, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర సామగ్రి సిద్ధం చేసుకోవాలని అన్నారు. కొనుగోలు సిబ్బందికి అవసరమైన మేర శిక్షణ అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదురుచూసే పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీ జరిగేలా సిబ్బందిని నియమించుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో చెల్లింపులు చేస్తామన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లింపులకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుత సీజన్‌లో మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు చేసేందుకు కలెక్టర్ ఏర్పాట్లు చేయాలని, వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లాలో కొనుగోలు కేంద్రాలను వరి కోతలకంటే ముందుగానే ప్రారంభించాలని అన్నారు. దీపావళి తర్వాత వరికోతలు వేగం కానున్న నేపథ్యంలో గన్నీబ్యాగులు, ధాన్యం రవాణా ఏర్పాట్లు, ధాన్యం సెంటర్లలో ఇన్‌ఫ్రా సౌకర్యాల కల్పన చర్యలు తీసుకోవాలన్నారు. క్రమపద్ధతిలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ధాన్యం కొనుగోలు క్రమపద్ధతిలో జరిగేలా ఏర్పాట్లు చేసి సన్నద్ధంగా ఉండాలన్నారు. సన్న, దొడ్డురకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రైతులకు స్పష్టంగా తెలిసేలా ప్రత్యేక కౌంటర్లు పెట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి నుంచి ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం రాములు, ములుగు నుంచి అదనపు కలెక్టర్ సి.హెచ్ .మహేందర్‌జీ, డీఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి షాఫైజల్ హుస్సేని, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రాంపతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేష్ కుమార్, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మొన్న మల్లోజుల... నేడు ఆశన్న

(7వ పేజీ తరువాయి)

ప్రయాణిస్తున్న వాహనం 20 అడుగుల దూరంలో ఎగిరి పడింది. కారులో కూర్చున్న చంద్రబాబు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆ ఘటనలో పాల్గొన్న తొమ్మిది మంది బృందానికి ఆశన్న నాయకత్వం వహిం చాడు. అలిపిరి ఘటనతో ఆశన్న పేరు దేశ వ్యాప్తంగా మర్మోగింది. ఆ తర్వాత ఆయనకు ఆంధ్ర-ఒడిశా బార్డ ర్‌లో మావోయిస్టు పార్టీని బలోపేతం చేసే బాధ్యతను కేంద్ర నాయకత్వం అప్పగించినట్లు తెలుస్తోంది.

మావోయిస్టుల మనుగడ ఏమిటి?


ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల మనుగడ ప్రశ్నార్థంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల అగ్ర నాయకుడు వేణుగోపాల్‌రావు లొంగిపోవడం, అదేబాటలో వాసుదేవరావు పయనిస్తుండటంతో ఆ పార్టీలో అయోమయం నెలకొందని తెలుస్తోంది. అనేక ఆపరేషన్లలో పాల్గొని, వ్యూహకర్తగా వ్యవహరించిన వాసుదేవరావు అలియాస్ ఆశన్న లొంగిపోతే మావోయిస్టు పార్టీకి పెద్ద షాకే అని పలువురు అంటున్నారు.


పుస్తకాలతోనే విజ్ఞానం : కోట రాజబాబు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతోనే బుద్ధి వికసిస్తుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు అన్నారు. బుధవారం భూపాలపల్లి పట్టణంలోని జిల్లా గ్రంథాలయానికి పుస్తక విజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో గుండు రాధ, రాంలక్ష్మణ్ కూతురు కాలువ సాయిపూజిత, నరహరి రూ.40వేల విలువ గల వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. ఈ పుస్తకాలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజబాబు చేతుల మీదుగా గ్రంథాల యానికి అందజేయగా వారు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ఒక గొప్ప నిర్ణయం తీసుకోవడం ఈ ప్రాంత యువతను చైతన్యం తీసుకువస్తాయని అన్నారు. ఎంతో మంది విద్యార్థులకు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం పుస్తక విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు గాజర్ల అశోక్ మాట్లాడుతూ విద్యార్థులకు, యువకులకు గ్రంథాలయాల అవసరం ఎంతో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, పుస్తక విజ్ఞాన వేదిక నాయకులు బాలగోని రమేష్, మంతెన సమ్మయ్య, బుర్ర కుమారస్వామి, పైడిపల్లి రమేష్, పంతకాని సమ్మయ్య, రాహుల్, శివరాజు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు క్వార్టర్లు

కౌన్సెలింగ్ ద్వారా కేటాయింపు ● అవకతవకలు జరిగాయని ఆరోపణల వెల్లువ





కౌన్సెలింగ్‌కు ముందు.. తర్వాత జాబితాలో ఉన్న వ్యత్యాసం

కృష్ణకాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కార్మికులకు క్వార్టర్లు కేటాయించే ప్రక్రియ కొనసాగింది. ఇందులో భాగంగా బుధవారం కౌన్సెలిం గ్‌ను నిర్వహించారు. టీటూ, ఎండీ సుభాష్‌కాలనీ, థౌజండ్ క్వార్టర్స్, రామప్పకాలనీలో 66 ఖాళీ క్వార్టర్లు ఉండగా 195 మంది కార్మికులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించామని ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి తెలిపారు. వీరిలో 47 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని అ న్నారు. ఇంకా 19 క్వార్టర్లు మిగిలిపోయాయని తెలిపారు. కమిటీ సభ్యులు ఎస్. కవీంద్ర, ఎర్రన్న, రవికు మార్, రవీందర్, మురళీ మోహన్, విశ్రాంత్‌కుమార్, ప్రణయ్ పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపులు ఇలా..


క్వార్టర్ల కౌన్సెలింగ్ పారదర్శకంగా జరగలేదని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈనెల 10న అన్ని గనుల్లో 192 మందితో కూడిన సీనియారిటీ లిస్టును అధికారులు విడుదల చేశారు. ఆ జాబితాను అన్ని గనుల్లో అతికించారు. అయితే.. కౌన్సెలింగ్ నిర్వహించే తేదీని మాత్రం అందులో ప్రకటించలేదు. పైగా ఎలాంటి ప్రచారం లేకుండా నేరుగా బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో హుటాహుటిన కార్మికులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి వచ్చింది. మరోవైపు 8 ఇన్‌క్లైన్‌లో ఎండీ-1634 నంబరు క్వార్టర్ ఖాళీగా ఉన్నట్లు గనులపై వేసిన నోటీసుల్లో అధికారులు పేర్కొన్నారు. తీరా బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్ సమయంలో ప్రదర్శించిన లిస్టులో ఆ నంబరు కానరాలేదు. ఆ క్వార్టర్ స్థానంలో ఎండీ-1633 నంబరును ప్రదర్శించారు. దీనిపై ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్వార్టర్ల కౌన్సెలింగ్‌లో కచ్చితంగా అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్నారు. దీనిపై సింగరేణి విజిలెన్స్ విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని అంటు న్నారు. మరోవైపు కార్మికులకు బహిరంగంగా చేపట్టా ల్సిన కౌన్సెలింగ్ తేదీని ప్రకటించకుండా ఉన్న పళంగా నిర్వ హించడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

వెంకటాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏదైనా పంట వివరాలు తప్పుగా నమోదైనట్టుయితే ఈనెల 25లోగా సంబంధిత క్లస్టర్ ఏఈవోను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో విలాసాగర్ టీచర్ మృతి

కాటారం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల టీచర్ వై.పద్మ(59) అనారోగ్యంతో బుధ వారం మృతి చెందారు. కొన్ని రోజులుగా మెడికల్ లీవ్‌పై ఉన్న ఆమె తుది శ్వాస విడిచారు. 2002 డీఎస్సీ ద్వారా నియామకం పొంది మండ లంలో 23 ఏళ్ల సుదీర్ఘకాలం సేవలందించి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన పద్మ మృతి చెందడంపై ఉపాధ్యాయ వర్గం, ఆమె శిష్యులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలానికి చెందిన పద్మ తన జన్మదినం రోజే మృతి చెందడం అందరినీ కలిచివేసింది



పద్మ (ఫైల్)

అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దు

(7వ పేజీ తరువాయి)

పూర్తి అవుతాయన్నారు. పాండవుల గుట్ట నుంచి జాతరకు చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణ పనులు అటవీ శాఖ అనుమతుల వల్ల ఆలస్యమవుతోందని తెలిపారు. గండ దీపం వద్దకు 30 మీటర్ల మెట్లను జాతరలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, బుగులోని జాతర చైర్మన్ గంగుల రమణారెడ్డి, నాయ కులు నిమ్మల విజేందర్, రొంటాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.